క్లుప్తంగా

రోడ్డుపై గుంతలు పూడ్చిన యువకులు



మదనాపురం: మండలంలోని ఎరగట్టు నుంచి అజ్జకొల్లు వరకు 5 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలు పడి అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గమనించిన యువకులు జేసీబీ అరుణ్, బాలకృష్ణ, షేక్ అశోక్, వెల్డింగ్ వెంకటేష్, కావలి భాను, ఎన్మూర్, చెన్నారెడ్డి ట్రాక్టర్ల సహకారంతో రోడ్డుపై ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చారు. కార్యక్రమంలో కావలి అశోక్‌కుమార్, ఏర్గటి మహేష్, లక్ష్మణ్, కుర్వ విష్ణు, రాజు, దేవేందర్, నాగరాజు, బాల రాజు, పాతమల్లి బాలకష్ణ, శివ, జానకీరాం, మొగిలి, తుంపల్లి కురుమూర్తి, జాని పాల్గొన్నారు.

‘పది’ పరీక్షల్లో ప్రతిభ చాటాలి

ఖిల్లాఘనపురం: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటాలని ఖిల్లాఘనపురం క్లస్టర్ హెచ్‌ఎం కాళీదాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి గణితంలో వారికి ఉన్న సందేహాలను తీర్చారు. గణితంలో మంచి మార్కులు సాధించాలంటే పాటించే పద్ధతులు, నియమాలను బోర్డుపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాసే సమయంలో ఒత్తిడికి లోను కాకూడదన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిభ చాటాలని సూచించారు.

గద్దర్‌కు ఘన నివాళి



ఆత్మకూర్: ప్రజాయుద్ధనౌక గద్దర్ 77వ జయంతి వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గాంధీచౌక్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గజ్జకట్టి ఆటపాటలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉర్రూతలూగించి రాష్ట్రం సిద్ధించడంలో గద్దర్‌ది కీలక పాత్ర అని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో రాబర్ట్, సీఎస్ శెట్టి, మోష, లక్ష్మీనారాయణశెట్టి, భీమన్న, బాలకృష్ణ, లింగన్న, ఇస్మాయిల్, భరత్, రాజు, ప్రసాద్, శివరాములు, తదితరులు పాల్గొన్నారు.

‘అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలి’



అమరచింత: అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేసి ఆదుకోవాలంటూ బీజేపీ మండల అధ్యక్షురాలు మంగ లావణ్య ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల వద్ద వేర్వేరుగా ధర్నా చేపట్టారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాసులు, మున్సిపల్ మేనేజర్ ఇసూఫ్‌కు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో మేర్వరాజు, భాస్కర్, మంగ అంజి, మల్లారెడ్డి, హరీశ్, నరాల నారాయణ, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విరాళం అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు పట్టణ కేంద్రానికి చెందిన శైలజ, బాలరాజు దంపతులు రూ.60,116 విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో తిమ్మన్నయాదవ్, సత్యంయాదవ్, బాలకొండయ్యయాదవ్, హన్మంత్‌యాదవ్, బొర్రకృష్ణయ్య, అద్వానీ శ్రీను, శంకర్‌యాదవ్, రాములుయాదవ్, యాదయ్య తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించాలి

అమరచింత: వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని కిష్టంపల్లిలో శుక్రవారం వాహనదారులు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తన వాహనానికి సంబంధించిన ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ప్రమాద బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేస్తున్న సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.



వాడిపోతున్న మామిడి పూత



వీపనగండ్ల శివారులో నల్లబారుతున్న మామిడి తోటలు

- నాలుగేళ్లుగా నష్టాల బాటలో మామిడి రైతులు
- రూ.లక్షల్లో పెట్టుబడి.. దిగుబడి అంతంత మాత్రమే
- మద్దతు ధర, పెట్టుబడి సాయానికి ఎదురుచూపులు

వీపనగండ్ల: ఉద్యాన పంటల సాగుకు ఆర్థికంగా తోడ్పాటు అందించి రైతులకు అండగా ఉంటామని ప్రభుత్వం, అధికారులు చెబుతున్నా మామిడి తోటలు పెంచుతున్న రైతుల పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా తయారవుతోంది. దీనికి తోడు అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో తోటలను పరిశీలించకపోవడంతో మామిడికి ఆశించే చీడపీడల దాటికి రైతులు కుదేలు అవుతున్నారు. నాలుగేళ్లుగా నష్టపోతున్న మామిడి రైతుల గోసను పట్టించుకునేవారే కరువయ్యారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మామిడి రైతులకు పెట్టుబడి సాయంతో పాటు మద్దతు ధర, మార్కెట్ వసతులు కల్పించాలని కోరుతున్నారు.

4,801 ఎకరాల్లో మామిడి సాగు

మండలంలోని 10 గ్రామాల్లో 4,801 ఎకరాలలో రైతులు మామిడి తోటలను సాగుచేస్తున్నారు. బొల్లారంలో 183 మంది రైతులు 404 ఎకరాల్లో, కొర్లకుంటలో 90 మంది 182 ఎకరాలు, వల్లభాపురంలో 39 మంది 65 ఎకరాలు, గోపల్‌దిన్నెలో 162 మంది 386 ఎకరాలు, గోవర్ధనగిరిలో 385 మంది 837 ఎకరాలు, కల్వరాల 128 మంది 338 ఎకరాలు, పుల్గర్‌చర్లలో 88 మంది 192 ఎకరాలు, సంగినేనిపల్లిలో 79 మంది 243 ఎకరాలు, తూముకుంటలో 263 మంది 602 ఎకరాలు, వీపనగండ్లలో 514 మంది 1201 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు.



తెగులు సోకిన పూత

నల్లబారుతున్న చెట్లు

మూడేళ్లుగా నష్టాలను చవిచూస్తున్న మామిడి రైతులు ఈ సీజన్‌లోనైనా ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వస్తుందని భావించినా.. ఆకుముడత, తేనేమంచు, నల్లబారుతున్న పూతలు, పచ్చపురుగు తదితర చీడపీడల వల్ల వచ్చిన కొద్దిపాటి పిందెలు కూడా నేలరాలుతుండడంతో రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. అయినా ఆశించి ఫలితం లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

ప్రతి ఏటా దళారుల బారిన..

స్థానికంగా మామిడి మార్కెట్ లేకపోవడంతో కాయలను విక్రయించాలంటే జడ్చర్ల, హైదరాబాద్ పట్టణాలకు వెళ్లాల్సిందే. దీంతో రవాణా ఖర్చులతో పాటు తరుగు పేరుతో దళారులు మామిడి రైతులను నిండా ముంచుతున్నారు. దీన్ని నివారించేందుకు స్థానికంగా మామిడి మార్కెట్లను ఏర్పాటు చేయాలని కోరినా.. అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి పాన్‌గల్, చిన్నంబావి, శ్రీరంగాపురం మండలాల రైతులకు అనువుగా ఉన్న వీపనగండ్ల మండల కేంద్రంలో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పెట్టుబడి సాయం అందివ్వాలి



రూ.లక్షలు వెచ్చించి మామిడి తోటలను సాగు చేసినా.. ప్రతి యేటా దిగుబడి రాక నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. పెట్టుబడి సాయంతో పాటు దళారులను నివారించేందుకు మార్కెట్ వసతి ఏర్పాటు చేయాలి. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి. – చెనమోని గంగయ్య, మామిడి కౌలు రైతు, వీపనగండ్ల

మార్కెట్ కోసం ఉద్యమిస్తాం



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను కేంద్రప్రభుత్వం మామిడి తోటల కోసం పైలెట్ జిల్లాగా ఎంపిక చేసి అవసరమైన నిధులను మంజూరు చేసిందని పలుమార్లు అధికారులు ఆర్భాటకపు ప్రకటనలు చేశారు. కానీ నేటికీ కొల్లాపూర్ నియోజకవర్గంలో మార్కెట్ ఏర్పాటుపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రతి యేటా దళారుల బారిన పడి నష్టపోతున్న మామిడి రైతులను సమీకరించి మార్కెట్ కోసం ఉద్యమిస్తాం. – బాల్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి

వాతావరణ పరిస్థితుల వల్లే..



ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల మూడేళ్లుగా మామిడి తోటల్లో సరైన దిగుబడి రావడం లేదు. తేనెమంచు తెగుల వల్ల తోటలకు అధిక నష్టం వాటిల్లుతుంది. తోటల్లో త్వరగా పూత వచ్చేందుకు కల్తార్ అనే క్రిమిసంహారక మందును రైతులు వాడటం వల్ల తోటలకు అధిక నష్టం వాటిల్లుతుంది. మార్కెట్ ఏర్పాటు కోసం అవసరమైన నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. – కృష్ణ, మండల ఉద్యాన శాఖ అధికారి, వీపనగండ్ల

పాఠశాల ఆవరణలో ప్రమాదకర గుంతలు



పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో వంట గది నిర్మాణం కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. వంట గది నిర్మాణం కోసం తవ్విన గుంతల్లో నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో వాటితో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ఆవరణలో పాఠశాల విద్యార్థులతో పాటు పక్కనే ఉన్న అంగన్‌వాడీ చిన్నారులు కూడా సంచరిస్తుండటంతో ఆ గుంతలతో ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా నిర్మాణం కోసం తవ్విన గుంతల్లో పనులు ప్రారంభించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం వీరశేఖరచారిని వివరణ కోరగా.. సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు.

నాస్తికత్వం ఒక శాస్త్రీయ ఆలోచన విధానం

వనపర్తి రూరల్: నాస్తికం అంటే ఒక శాస్త్రీయ ఆలోచన విధానం అని నాస్తిక సమాజం జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ఫిబ్రవరి 8, 9న గుంటూరు జిల్లా మంగళగిరిలో జరగనున్న 33వ జాతీయ నాస్తిక మేళా కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాస్తిక ఉద్యమం అంటే కేవలం దైవభావాన్ని తిరస్కరించడం కాదని.. పరిశోధనాత్మకంగా నిరూపితమైన శాస్త్రవిజ్ఞానాన్ని నమ్మటమే అన్నారు. అది మనిషి పురోగమనానికి దోహదం చేస్తుందని వివరించారు. అమానవీయమైన సామాజిక వ్యవస్థ స్థానంలో సమ సమాజ నిర్మాణంలో పాలు పంచుకుంటుదన్నారు. నాస్తికం అంటే ప్రశ్న అని, ప్రశ్న ఆధారంగానే సమాజ ప్రగతి, పురోగమనం వైపు సాగుతోందని పేర్కొన్నారు. ప్రశ్నించిన సార్వాకులను సనాతనం శిక్షించిందని ఆరోపించారు. 33వ జాతీయ నాస్తికమేళాకు వనపర్తి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె విజయరాములు, పట్టణ కార్యదర్శి రమేష్, నాయకులు శ్రీరామ్,అబ్రహం,గోపాలకృష్ణ, శ్రీహరి, సీఎస్ శెట్టి పాల్గొన్నారు.

రేపటి నుంచి అబ్దుల్‌రహీం ఉర్సు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

మదనాపురం: కులమతాలకతీతంగా జరిగే అబ్దుల్ రహీం ఆరాధన ఉత్సవాలు మండలంలోని దుప్పల్లిలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఉత్సవాలకు తెలంగాణతో పాటు కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై దర్గాను దర్శించుకుంటారు. భక్తులు కానుకల రూపంలో తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆదివారం రాత్రి దర్గా నుంచి గంధాన్ని భక్తులు తలపై పెట్టుకొని భాజాభజంత్రితో ఊరేగింపుగా తీసుకెళ్లి మహబూబ్‌సూబాని దర్గాకు సమర్పిస్తారు. సోమవారం దర్గాను దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. మంగళవారం దివ్యఖురాన్ పఠనం కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

పీఠాధిపతుల రాక..

తాండూర్ సయ్యద్ అబ్దుల్ కరీం దర్గా పీఠాధిపతులు సయ్యద్ సాబేర్ పాష, అజీష్‌పాషా ముఖ్య అతిథిలుగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు మూడు రోజుల పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విడిది సత్రాలు, అన్నదానం, తాగునీటి వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు సుకుమార్‌గౌడ్ శిష్యబృందం, దర్గా నిర్వాహకులు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా రవిబాబు



అమరచింత: మున్సిపల్ కమిషనర్‌గా రవిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న నురుల్‌నదీం భూత్పూర్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ కావడంతో.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన రవిబాబు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి పట్టణ ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

‘ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది’



కొత్తకోట రూరల్: సమాజంలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది భవిష్యత్ మార్గదర్శకులుగా తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని అన్నారు. పెద్దమందడి మండలంలోని బలిజపల్లి, జంగమాయపల్లి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్న మొల్గర చంద్రశేఖర్ పదవీ విరమణ కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై చంద్రశేఖర్ దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో 41ఏళ్ల పాటు బోధన చేసిన చంద్రశేఖర్ విధి నిర్వహణలో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓలు బాణం విష్ణు, జయశంకర్, నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం మంజులత, మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్‌గౌడ్, జేఏసీ నాయకులు వేణుగోపాల్, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

హక్కుల కోసం పోరాటం

అమరచింత: తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ జిల్లా డైరీని శుక్రవారం తహసీల్దార్ రవికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఎన్జీఓ అధ్యక్షుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న ఏకైక సంఘం తమదే అన్నారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన హక్కులను పొందేందుకు రాజీలేని పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐలు గోపాల్, వెంకటయ్య పాల్గొన్నారు.

మాజీ చైర్‌పర్సన్లకు సన్మానం

ఆత్మకూర్/అమరచింత: మున్సిపాలిటీల మాజీ చైర్‌పర్సన్లు గాయత్రి, మంగమ్మను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సన్మానించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



వీపనగండ్లలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జీహెచ్‌ఎం భానుప్రకాష్



మదనాపురంలో.. ప్రతిభ చాటిన విద్యార్థులు

వీపనగడ్ల: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఫిజికల్ సైన్స్ మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మండల కేంద్రానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు మనోజ్ ప్రథమ స్థానం, అశోక్, శిరీష ద్వితీయ స్థానం సాధించారు. వారిని పాఠశాల జీహెచ్‌ఎం భానుప్రకాష్ అభినందించి బహుతులను అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు మహేశ్వర్, మోహన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆన్‌లైన్ ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఠాగూర్‌నాయుడు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం శ్రీనిధి జెడ్పీహెచ్‌ఎస్ దుప్పల్లి, ద్వితీయ స్థానం సాయికుమార్ జెడ్పీహెచ్‌ఎస్ అజ్జకొలు విద్యార్థి సాధించారు. పాఠశాల ఇంచార్జ్ మహేందర్‌గౌడ్ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, మూలే ఆంజనేయులు ఈశ్వర్ లాల్ పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



కేతేపల్లిలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో కన్యాకపరమేశ్వర ఆలయంలో వాసవీ మాత ఆత్మర్పణ దినోత్సవం శుక్రవారం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృత అభిషేకం, శాంతి హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వీరప్రతాప్, చంద్రమౌళి, రమేష్, మురళీధర్, యాదగిరి మాణిక్యం, రాంబాబు, శ్రీనివాసులు, నవీన్, వెంకటేష్, శ్రీరామచంద్రుడు పాల్గొన్నారు.

అమరచింత: మండల కేంద్రంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్యవైశ్యుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న వాసవీమాతకు మహిళలు భక్తిశ్రద్ధలతో కుంకుమర్చానతో పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సహకరించిన కలకొండ బాల్‌నారాయణ సతిమణి విజయలక్ష్మిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ మహిళా క్లబ్ సభ్యులు పావని, జయశ్రీ, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి ఆత్మార్పరణ మహోత్సవ వేడుకలను ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజాము నుంచే అభిషేక మహోత్సవ పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. అమ్మవారికి 108 జ్యోతులతో మంగళహారతులు ఇవ్వడం ప్రత్యేక ఆకర్షణగా నిలించింది. కార్యక్రమంలో నాగవల్లి యాదగిరి, పూరి బాలరాజు, బచ్చు వెంకటేష్, గోవింద్‌గుప్తా, ప్రవీణ్, శివ, శ్రీకాంత్, బాలకృష్ణ, కల్వ భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలను ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా సామాజిక ఉద్యమం, అంటరాని జాతి ఆత్మగౌరవం కోసం కృషి చేస్తున్న మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఎలాంటి పదవులు ఆశించకుండా దళితులకు సేవలందించిన నాయకుడికి పద్మశ్రీ ఇచ్చి సత్కరించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్న, యువ మోర్చా మండల అధ్యక్షుడు కొరిగెల గోపి, మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, ఓబీసీ మండల అధ్యక్షుడు రాంచందర్, గిరిజన మోర్చా అధ్యక్షుడు రవినాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సత్యనారాయణ, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం పవర్‌కట్ ఉంటుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్దారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. బుద్దారంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, తండాలకు కరెంట్ ఉండదని ప్రజలు సహకరించాలని కోరారు.

మహిళకు రిమాండ్

వనపర్తి రూరల్: బస్టాండ్‌లో జరిగిన చోరీ ఘటనలో పట్టుబడిన నిందితురాలిపై కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లాకు చెందిన పక్రునిసాబేగం ఈ నెల 28న కర్నూల్‌కు వెళ్లడానికి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు రాగా.. ఆమె పర్సు చోరీ గురైందని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారణ ప్రారంభించిన పోలీసులు వనపర్తి బస్టాండ్‌లో శుక్రవారం అనుమానస్పదంగా తిరుగుతున్న ఆకుల మహేశ్వరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆమెది కొత్తకోట మండలంలోని దండుగడ్డ గ్రామం అని తెలిపింది. ఈ నెల 28న ఆర్టీసీ బస్టాండ్‌లో పర్సు చోరీ చేశానని, అందులో సెల్‌ఫోన్, 4 గ్రాములు బంగారం చోరీ చేశానని ఒప్పుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరు పర్చగా జడ్జీ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

‘మాదిగలకు న్యాయం చేయాలి’

మదనాపురం: దశాబ్దాల కాలంగా ఉమ్మడి రాష్ట్రంలో మాదిగలు తీవ్ర అన్యాయానికి గురయ్యారని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు మిషేక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 7న లక్ష డప్పుల ప్రదర్శన విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాదిగలు న్యాయం చేస్తూ ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీసాక్షిగా చేసిన ప్రకటనకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. బోయేజ్, సుభాష్, రాజు, కాంతికుమార్, రమేష్ ఉన్నారు.



పాఠశాలలో సౌకర్యాలపై ఆరా..



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి సౌకర్యాలు అందుతున్నాయని, వారికి ఇంకా ఏమైనా అవసరాలు ఉన్నాయా అని జిల్లా అధికారులు తెలుసుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి యుగంధర్, జీసీఈఓ సుభలక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటమ్మ సందర్శించారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు యూనిఫాం, రక్షిత తాగునీరు, కిచెన్, గార్డెన్ వంటి వాటిని పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. అదే సమయంలో విద్యార్థులకు మండల స్థాయి భౌతికశాస్త్రం ఆన్‌లైన్ ప్రతిభా పరీక్షలు జరుగుతుండగా విద్యార్థులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమాకాంత్, ఉపాధ్యాయులు ఉన్నారు.

బైక్ చోరీ.. నిందితుడి అరెస్టు

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని రాయిగడ్డకు చెందిన ఎల్లస్వామికి సంబంధించిన బైక్‌ను జనవరి 3న చోరీ చేసిన వ్యక్తి శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పట్టణంలోని రాయిగడ్డకు చెందిన ఎల్లస్వామి అదే వీధిలోని మత్స్యపారిశ్రామిక కార్యాలయం ఎదుట తన బైక్‌కు ఆపగా.. జనవరి 3న చోరీ గురైందని ఫిర్యాదు చేశారు. వనపర్తి పట్టణంలో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పెద్దమందడి మండలంలోని బలిజపల్లికి చెందిన పుట్ట కురుమయ్య వారి చూసి పారిపోతుండగా.. పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. దీంతో బైక్‌ను వనపర్తిలో రాయిగడ్డలో చోరీ చేశానని ఒప్పుకోవడంతో బైక్ స్వాధీనం చేసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

ల్యాప్‌టాప్ చోరీ కేసులో..

వనపర్తి రూరల్: పట్టణ కేంద్రంలో జనవరి 28న కారులో ఉన్న ల్యాప్‌టాప్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితుడు విష్ణువర్ధన్‌రెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చోరీ జరిగిన ప్రదేశంలోని సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా.. పట్టణంలోని జంగాలగుట్టకు చెందిన బుడగజంగం చెన్నయ్యగా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడు తానే చోరీ చేశానని ఒప్పుకోవడంతో ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.